క్లుప్తంగా

నేడు 'బాబు ష్యూరిటీ మోసం గ్యారంటీ'

ఐ.పోలవరం: మండలంలోని మురమళ్లలో మంగళవారం బాబు ష్యూరిటీ.. మోసం గ్యారంటీ కార్యక్రమం జరుగుతుందని వైఎస్సార్ సీపీ మండల పార్టీ అధ్యక్షుడు పిన్నమరాజు వెంకటపతిరాజు సోమవారం తెలిపారు. పార్టీ సీనియర్ నాయకుడు, మురమళ్ల సర్పంచ్ కాలే రాజబాబు ఇంటి వద్ద ఉదయం పది గంటలకు ఈ కార్యక్రమం నిర్వహిస్తున్నామన్నారు. వైఎస్సార్ సీపీ ముమ్మిడివరం నియోజకవర్గ పరిశీలకుడు మాతా మురళీ, జెడ్పీటీసీ సభ్యుడు సతీష్ రాజు, ఎంపీపీ మోర్తా రాణి మిరియం జ్యోతి పాల్గొంటారన్నారు. కార్యక్రమంలో పార్టీకి చెందిన రాష్ట్ర కార్యవర్గ సభ్యులు, వివిధ విభాగాల ప్రతినిధులు, నాయకులు, కార్యకర్తలు పెద్ద ఎత్తున పాల్గొనాలని వెంకటపతిరాజు కోరారు.

నేతాజీ విగ్రహానికి నివాళులు



చంద్రబోస్ విగ్రహానికి నివాళులర్పించిన మునిస్వామి

యానాం: సాయుధ పోరాటం ద్వారానే దేశానికి ఆంగ్లేయుల నుంచి స్వాతంత్ర్యం సిద్ధిస్తుందని నమ్మి అసాధారణ పోరాటం చేసిన నేతాజీ సుభాష్ చంద్రబోస్ చిరస్మరణీయులని ఆర్ఏఓ మునిస్వామి పేర్కొన్నారు. సోమవారం స్థానిక ఫెర్రీరోడ్డులో చంద్రబోస్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ, 21 ఏళ్ల వయసులోనే స్వాతంత్రోద్యమంలో చేరిన బోస్ అజాద్ హింద్ ఫౌజ్ దళం ఏర్పాటుచేసి బ్రిటీష్ వారిని గడగడలాడించారన్నారు. కార్యక్రమంలో సీఏ అడలరసన్, పీఆర్ఏఓ కొల్లు ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహన ఉండాలి

తాళ్లరేవు: మహిళలు పునరుత్పత్తి ఆరోగ్యంపై అవగాహన కలిగి ఉండాలని బీమాబాయి మహిళా మండలి చీఫ్ ఫంక్షనరీ వాసంశెట్టి నందివర్ధన సూచించారు. సోమవారం తాళ్లరేవు బైపాస్ రోడ్డులోని మహిళా మండలి కార్యాలయంలో మహిళలు, కౌమార బాలికలకు పునరుత్పత్తి ఆరోగ్యం, కౌమార దశలో గర్భాలు, రుతుక్రమ శుభ్రత అనే అంశాలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆమె మాట్లాడుతూ, పునరుత్పత్తిలో వివిధ దశల్లో జరిగే మార్పులను వివరించారు. ఎంపీహెచ్ఎ ఈవీ రత్నం మాట్లాడుతూ, రుతుక్రమ పరిశుభ్రతను గురించి వివరించడంతోపాటు కౌమార దశలో వచ్చే గర్భాలు, తీసుకోవాల్సిన జాగ్రత్తలను తెలిపారు. ఈ కార్యక్రమంలో పీఎస్ఆర్ కనకాంబరం, విమల, నాగలక్ష్మి, రేవు లోవరాజు తదితరులు పాల్గొన్నారు.

విద్యార్థులకు ఉపకార వేతనాల పంపిణీ

అమలాపురం టౌన్: పట్టణంలోని మహాత్మా గాంధీ మున్సిపల్ ఉన్నత పాఠశాలకు చెందిన ఐదుగురు విద్యార్థులకు మొబర్లీపేట కెనరా బ్యాంక్ బ్రాంచ్ ఉపకార వేతనాలను పాఠశాలలో సోమవారం అందజేశారు. ఒక్కో విద్యార్థికి రూ. 24 వేలు చొప్పున కెనరా బ్యాంక్ బ్రాంచ్ మేనేజర్ సుశాంత్ కుమార్ పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, విద్యార్థులు వారు ఎంచుకున్న లక్ష్యాలను చేరుకునేందుకు పేదరికం అడ్డు రాకూడదనే ఉద్దేశంతోనే ఈ ఉపకార వేతనాల అందజేత కార్యక్రమాన్ని చేపట్టినట్లు చెప్పారు. కార్యక్రమంలో పాఠశాల ప్రధానోపాధ్యాయుడు ఘన సత్యనారాయణ, ఉపాధ్యాయులు బీఎస్ వెంకటేశ్వర రావు, కేఆర్ఎస్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

పోలింగ్ బూత్‌లపై అవగాహన పెంచుకోవాలి

ఉప్పలగుప్తం: ఉద్యోగ బదిలీల్లో నూతనంగా వచ్చిన బీఎల్‌వోలు వారి పరిధిలో ఉన్న పోలింగ్ బూత్‌లపై అవగాహన పెంచుకొని, భవిష్యత్తులో ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా మార్పులు, చేర్పులను గ్రహించుకోవాలని తహసీల్దార్ దివాకర్ సూచించారు. స్థానిక తహసీల్దార్ కార్యాలయంలో వీఆర్‌వోలు, బీఎల్‌వోలకు సోమవారం ఆయన అవగాహన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు. ఆయన మాట్లాడుతూ, వాతావరణ శాఖ మూడు రోజులపాటు తుపాన్ హెచ్చరికలు జారీ చేయడంతో వీఆర్‌వోలంతా అప్రమత్తంగా ఉండి గ్రామాల్లోని ప్రజలకు అందుబాటులో ఉండాలని సూచించారు. తీర ప్రాంతాల ప్రజలను గమనిస్తూ, మత్స్యకారులను వేటకు వెళ్లకుండా సురక్షిత భవనాలకు తరలించాలని సిబ్బందికి సూచించారు. కార్యక్రమంలో ఆర్ఐ నాగూర్ మీరాసాహెబ్, వీఆర్‌వోలు షేక్ అహ్మద్ అలీషా, నాగులపల్లి పల్లంరాజు, పెట్టా బాలాజీరావు తదితరులు పాల్గొన్నారు.

అంగన్‌వాడీ భవనం ప్రారంభం

ఐ.పోలవరం: ముమ్మిడివరం ఐసీడీఎస్ పరిధిలోని ఐ.పోలవరం మండలం బాణాపురంలో నిర్మించిన అంగనవాడీ కేంద్రాన్ని సోమవారం ప్రభుత్వ విప్, ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు సోమవారం ప్రారంభించారు. నాడు- నేడు నిధులు రూ.16 లక్షలతో నూతన భవనాన్ని నిర్మించారు.

మొగటికే మోసం.!



ఇసుక మేటలతో మూసుకుపోయిన ఎన్.రామేశ్వరం మొగ



దేశికోడు డ్రైన్‌లో స్తంభించిన ముంపునీరు

- భారీ వర్షాలకు మూసుకుపోయిన మొగ
- వేలాది ఎకరాల్లో ముంపు ప్రభావం
- ఏటా తవ్వకాలకు రూ.లక్షల ఖర్చు

అల్లవరం: నియోజకవర్గ పరిధిలోని అల్లవరం, ఉప్పలగుప్తం, అమలాపురం మండలాల్లోని వేలాది ఎకరాల్లో వరి పొలాల్లోని ముంపు నీరు సముద్రంలోకి వెళ్లేందుకు (సీమౌత్) ఎన్.రామేశ్వరం మొగ ప్రధానమైనది. ఎన్నో ఏళ్లుగా ముంపు నీటిని ఈ మొగ ద్వారా సముద్రంలోకి పంపి వేలాది ఎకరాల్లో సాగు చేస్తున్న పంటను సుభిక్షంగా కాపాడుతున్నారు. ప్రధాన మురుగు కాలువల వెంట అనధికార ఆక్వా సాగు, డ్రైనేజీలో ఆక్వా వ్యర్థాలు వదిలేయడం, ప్రధాన కాల్వల్లో నీటి ప్రవాహాన్ని నియంత్రించే వలకట్లతో ముంపు సమస్య తీవ్రంగా మారింది. వీటి కారణంగా దశాబ్ద కాలంగా ముంపు తీవ్రత నియోజకవర్గ రైతులను వేధిస్తుంది. బంగాళాఖాతంలో ఏర్పడిన అల్పపీడన ప్రభావంతో నాలుగు రోజులుగా కురుస్తున్న భారీ వర్షాలకు అల్లవరం మండలం కొమరగిరిపట్నం శివారు ఎన్.రామేశ్వరంలోని మురుగునీరు దిగే మొగ ఇసుక మేటలతో పూడుకుపోయింది. దీంతో నియోజకవర్గ వ్యాప్తంగా ప్రధాన డ్రైన్లు లోయర్‌కౌశిక, దేశికోడు, వాసాలతిప్ప మురుగునీటితో స్తంభించి నదిని తలపిస్తున్నాయి.

తీవ్రమైన ముంపు సమస్య

మండలంలో 17 కిలోమీటర్ల పొడవున విస్తరించి ఉన్న లోయిర్ కౌశిక పరిధిలోని మొగళ్లమూరు, తూర్పులంక, రెల్లుగడ్డ, దేవగుప్తం, సామంతకుర్రు, ఎస్.పల్లిపాలెం, వాసాలతిప్ప డ్రైన్ పరిధిలోని డి.రావులపాలెం, గోపవరం, సరిపెల్ల, ఎస్.యానం, చల్లపల్లి, దేశికోడు డ్రైన్ పరిధిలోని కోడూరుపాడు, గూడాల, తాడికోన, బోడసకుర్రు గ్రామాల్లో ముంపు సమస్య తీవ్రంగా ఉంది. అమలాపురం, అయినవిల్లి మండలాల్లోని ముంపు నీరు కుమ్మరికాలువ గుండా వైనతేయ నదిలో కలుస్తుంది. ప్రస్తుతం ఎన్.రామేశ్వరం మొగ ఇసుక మేటలతో నిండిపోవడంతో పంట



భీమనపల్లిలో నీట మునిగిన వరి పొలాలు

పొలాల్లో ముంపు నీరు స్తంభించింది. దీనికి తోడు ప్రధాన డ్రైన్‌లో చేపలను వేటాడేందుకు మత్స్యకారులు ఏర్పాటు చేస్తున్న వలకట్లు మురుగునీటి ప్రవాహానికి తీవ్ర ప్రతిబంధకంగా మారింది. దీంతో వేలాది ఎకరాల్లో వరినాట్లు ముంపులో చిక్కుకున్నాయి.

ఇసుక మేటలను తొలగించేందుకు

మురుగునీరు దిగే దారి లేక వ్యవసాయ క్షేత్రాలు నదిని తలపిస్తున్నాయని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ముంపు ప్రభావంతో వరినాట్లు దెబ్బతింటున్నాయని రైతులు వాపోతున్నారు. భారీ వర్షాల ప్రభావంతో ప్రతి ఏటా ఎన్.రామేశ్వరం మొగ మూసుకుపోవడం, ఇసుక మేటలను తొలగించేందుకు అధికారులు లక్షలు ఖర్చు చేయడం పరిపాటిగా మారింది. భారీ వర్షాలు కురవడంతో మొగ మూసుకుపోవడం సర్వసాధరణమైంది. నియోజకవర్గ పరిధిలోని వేలాది ఎకరాలు ముంపు నుంచి పంటను కాపాడుకోవాలంటే ఎన్.రామేశ్వరం మొగకి శాశ్వత పరిష్కారం చూపాలని రైతులు కోరుతున్నారు.

నిర్లక్ష్యం చేస్తే ప్రమాదం

ఇటీవల కురిసిన భారీ వర్షాల కారణంగా మొగ మూసుకుపోయి శివారు ప్రాంతాలు ముంపులో చిక్కుకున్నాయి. ముంపు తీరాలంటే మొగ తవ్వకాలు చేపట్టి మురుగునీరు సముద్రంలోకి వెళ్లేలా దారి కల్పించాలి. మొగ తవ్వకాల పట్ల నిర్లక్ష్యం చేస్తే వరినాట్లు దెబ్బతినే ప్రమాదం ఉంది.

– చెక్కా సత్తిబాబు, రైతు–మత్స్యకారుడు, ఎన్.రామేశ్వరం.

నిధులు మంజూరు చేస్తే పనులు చేపడతాం

ముంపునీరు సముద్రంలోకి వెళ్లే ఎన్.రామేశ్వరం మొగలో ఇసుక మేటలతో నిండిపోయింది. ప్రస్తుతం ముంపునీరు వెళ్లే దారి లేదు. ప్రస్తుతం ఎగువ ప్రాంతాల నుంచి వస్తున్న ముంపు నీరు టైడల్ ఏరియాలో స్టోర్ అవుతుంది. ఈ విషయంపై డ్రైను డీఈ కిషోర్ జిల్లా కలెక్టర్‌కు వీడియోల ద్వారా సమాచారం ఇచ్చారు. జిల్లా కలెక్టర్ నిధులు మంజూరు చేస్తే నీటి సంఘాల ఆధ్వర్యంలో పూడికతీత పనులు చేపడతాం.

– సునీతాదేవి, డ్రైన్స్ ఏఈ, అల్లవరం.

ఆదమరిస్తే అంతే సంగతి.!



విద్యుత్ స్తంభాన్ని చుట్టేసిన పొదలను తాకుతున్న వైర్లు

అల్లవరం: బోడసకుర్రు పంచాయతీ పరిధిలోని జగనన్న కాలనీకి వెళ్లే రోడ్డులో విద్యుత్ స్తంభం ప్రమాదకరంగా మారింది. ప్రస్తుతం భారీ వర్షాలు కురుస్తున్న నేపథ్యంలో కరెంట్ ఉన్న సమయంలో 11కేవీ వైర్ల నుంచి విద్యుత్ స్తంభానికి అల్లుకున్న పొదలు, చెట్లకు విద్యుత్ సర్క్యూట్ అవుతుంది. పొదలు అల్లుకోవడంతో కరెంట్ స్తంభం మచ్చుకైనా కనపడట్లేదని స్థానికులు చెబుతున్నారు. స్థానిక లైన్‌మెన్‌కు ఎన్నిసార్లు ఫిర్యాదు చేసినా స్పందించట్లేదని వార్డు మెంబర్ శివస్వామి వాపోయారు. విద్యుత్ సర్క్యూట్‌తో ప్రమాదం జరిగితే విద్యుత్ అధికారులు బాధ్యత తీసుకుంటారా అని ప్రశ్నించారు.

ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాలి



హైవేలో ప్రమాదాలపై తహసీల్దార్‌తో మాట్లాడుతున్న అఖిలపక్ష నాయకులు

తాళ్లరేవు: మండలంలోని హైవేపై ప్రమాదాల నివారణకు అధికారులు చర్యలు చేపట్టాలని అఖిలపక్ష నాయకులు డిమాండ్ చేశారు. సోమవారం ప్రజాసంఘాల ఆధ్వర్యంలో నాయకులు తహసీల్దార్ త్రినాథ రావును కలిసి మాట్లాడారు. నెల రోజుల క్రితం ప్రమాదాల నివారణకు చర్యలు చేపట్టాల్సిందిగా కోరుతూ వినతిపత్రం ఇచ్చామని, ఏఏ చర్యలు చేపట్టారని ప్రశ్నించారు. ఇటీవల ప్రమాదాలు మరీ ఎక్కువయ్యాయని, గడచిన నెల రోజుల్లో సుమారు పదికిపైగా ప్రమాదాలు సంభవించి 13 మంది మృత్యువాత పడ్డారని తహసీల్దార్‌కు వివరించారు. ప్రమాదాలు అధికంగా మద్యం మత్తులో జరుగుతున్నాయని వాపోయారు. పోలేకుర్రు వై.జంక్షన్ వద్ద తనిఖీలు తూతూ మంత్రంగా జరుగుతున్నాయని ఆరోపించారు. దీనిపై స్పందించిన తహసీల్దార్ మాట్లాడుతూ, వినతిపత్రాన్ని హైవే అధికారులకు పంపించామని, ఇప్పటికే ప్రమాద నివారణా చర్యలు చేపట్టినట్లు తెలిపారు. తహసీల్దార్‌ను కలిసిన వారిలో సీపీఎం నాయకులు టేకుమూడి ఈశ్వరరావు, వల్లు రాజబాబు, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి బొంతు మోహన్ తదితరులు ఉన్నారు.

అభివృద్ధి పనుల ప్రారంభం

అమలాపురం టౌన్: పట్టణ మున్సిపాలిటీ పరిధిలో స్థానిక 27వ వార్డులో మున్సిపాలిటీ సాధారణ నిధులు రూ.25 లక్షలతో నిర్మించిన జీటీఎస్ భవన నిర్మాణంలో పశు జనన నియంత్రణ, వ్యాక్సినేషన్ పనులు, 29వ వార్డులో రూ.40 లక్షలతో నిర్మించిన హిందూ స్మశాన వాటికను సోమవారం ఎమ్మెల్యే ఆనందరావు ప్రారంభించారు. 26వ వార్డులో మెప్మా నిధులు రూ.32 లక్షలతో చేపల మార్కెట్ ఆధునీకీకరణ పనులకు శంకుస్థాపన చేశారు.

రూ.లక్ష విలువైన ఫ్రిజర్ బాక్సు బహూకరణ

దివంగత ఆశెట్టి సత్యనారాయణ, భారతమ్మ జ్ఞాపకార్థం వారి కుమారుడు, మాజీ కౌన్సిలర్ ఆశెట్టి ఆదిబాబు, కౌన్సిలర్ నాగదుర్గ దంపతులు మున్సిపాలిటీకి రూ.లక్ష విలువైన ఫ్రిజర్ (శవాలను భద్రపరిచే మెషీన్) బహూకరించారు. ఈ ఫ్రిజర్‌ను స్థానిక హిందూ స్మశాన వాటికలో ఎమ్మెల్యేకు ఆశెట్టి ఆదిబాబు దంపతులు అందజేశారు. కార్యక్రమాల్లో మున్సిపల్ చైర్‌పర్సన్ రెడ్డి సత్య నాగేంద్రమణి, అముడా చైర్మన్ అల్లాడ స్వామినాయుడు, మున్సిపల్ కమిషనర్ నిర్మల్‌కుమార్, కౌన్సిలర్లు రామకృష్ణ, గంగ, మున్సిపల్ కౌన్సిల్ ప్రతిపక్ష నాయకుడు యేడిద శ్రీను, వైఎస్సార్ సీపీ పట్టణ అధ్యక్షుడు సంసాని బులినాని, పార్టీ జిల్లా కార్యదర్శి కముజు రమణ, కౌన్సిల్ విప్ బండారు సత్యనారాయణ పాల్గొన్నారు.

నీట మునిగిన వరి చేలు



వేట్లపాలెంలో ముంపునకు గురైన వరినాట్లు

కాట్రేనికోన: అల్పపీడన ద్రోణితో కురుస్తున్న భారీ వర్షాలకు వరినాట్లు నీట మునిగాయి. పంట చేలకు నీరు సకాలంలో అందక నాట్లు ఆలస్యంగా వేశారు. వరినాట్లు ముందుగా వేసి ఉంటే ముంపును తట్టుకునే పరిస్థితి ఉండేదని, తొలకరి పంట ప్రశ్నార్థకంగా ఉందని రైతులు వాపోతున్నారు. మండలంలో ఇంకా వరినాట్లు పూర్తి కాలేదు. కొన్ని రోజులుగా కురుస్తున్న వర్షాలకు వరినాట్లు పూర్తి మునిగిపోవడంతో చెరువును తలపిస్తున్నాయి. మండలంలో వేట్లపాలెం, కాట్రేనికోన–రేవు వారి పేట రోడ్డు వెంబడి చేలు, గెద్దనపల్లి, దొంతికుర్రు, చిట్టమ్మ చెరువు, పల్లంకుర్రు, కందికుప్ప ప్రాంతాల్లో వర్షపు నీరు దిగేందుకు కాలువులు పూడికతో నిండిపోవడంతో ముంపు నీటిలో ఉన్నాయి. ముంపు నీరు దిగేందుకు కాలువలు బాగు చేయాలని రైతులు కోరుతున్నారు.

స్కానింగ్ కేంద్రాల్లో ఆకస్మిక తనిఖీలు



అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రం రికార్డులను పరిశీలిస్తున్న ఆర్డీవో

అమలాపురం టౌన్: గర్భస్థ పిండ నిర్ధారణ పరీక్షల నిషేధ చట్టాన్ని పటిష్టంగా అమలు చేయాలని ఇన్‌ఛార్జి డీఆర్వో, అమలాపురం ఆర్డీవో కొత్త మాధవి అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులకు సూచించారు. పట్టణంలోని భూపయ్య అగ్రహారంలో రవీంద్ర ఆస్పత్రి, ముమ్మిడివరంలోని మహిక ఆస్పత్రిల్లోని అల్ట్రా సౌండ్ స్కానింగ్ కేంద్రాలను మాధవి సోమవారం సాయంత్రం ఆకస్మికంగా తనిఖీలు చేశారు. ఈ చట్టం అమలు తీరుపై తీరా తీశారు. ఆడ శిశువుల జననాల పట్ల వివక్షతను అరికట్టే చర్యల్లో భాగంగా జిల్లాలో ఈ నిషేధిత చట్టాన్ని అమలు చేయాలని సంబంధిత అధికారులు, వైద్యాధికారులను ఆదేశించారు. స్కానింగ్ కేంద్రాల నిర్వాహకులు, ఆయా ఆస్పత్రుల వైద్యులు, పీసీపీ, ఎన్‌డీటీ కమిటీ సభ్యులకు పలు సూచనలు చేశారు. అన్ని స్కానింగ్ కేంద్రాల్లో పీసీపీఎన్‌డీటీ కమిటీ సభ్యులు ప్రత్యేక చొరవ తీసుకొని డేకాయ్ తనిఖీలు నిర్వహించాలని ఆదేశించారు. చట్టాన్ని ఉల్లంఘించిన వారిపై చర్యలు తీసుకోవాలన్నారు. జిల్లా అదనపు వైద్యారోగ్య శాఖ అధికారి భరతలక్ష్మి కూడా పలు సూచనలు చేశారు.

పనులు మొదలు పెట్టరా?



మున్సిపల్ కమిషనర్‌తో సమావేశమైన అశోక్

యానాం: మున్సిపాలిటీ పరిధిలో పలు పనులకు కోట్లాది రూపాయిలు మంజూరై ఖజానాలో మూలుగుతున్నప్పటికి పనులు మాత్రం ప్రారంభించకుండా అధికారులు నిర్లిప్తత ప్రదర్శిస్తున్నారని, కాలయాపన చేయడం అన్యాయమని ఎమ్మెల్యే అశోక్ అన్నారు. సోమవారం ఆయన నూతన మున్సిపల్ కమిషనర్ బుద్ధి అఖిల్‌ను కలిసి గతంలో మంజూరైన నిధులు, పనుల పురోగతి గురించి చర్చించారు. ఆయన మాట్లాడుతూ, మున్సిపాలిటీ పరిధిలో సీసీరోడ్లు, డ్రైన్‌లు తదితర సౌకర్యాల కల్పనకు ఎమ్మెల్యే ల్యాడ్ నిధులు రూ.1.18 కోట్లు, సీఎస్ఆర్ నిధులు రూ.1.25కోట్లు మంజూరైనా ఇప్పటివరకు పనులు ప్రారంభించకుండా అధికారులు నిర్లక్ష్యం ప్రదర్శిస్తున్నారని మండిపడ్డారు. ఆయా గ్రామాల్లో పలు నిర్మాణాల కోసం రూ.2.44 కోట్లు ఎన్ఐటీ పర్మిషన్ కోసం నెల రోజులుగా కృషి చేయడంతో దాని అప్రూవల్ సాధించగా, దానికి సంబంధించిన ఫైల్‌ను కమిషనర్‌కు అందజేశారు. యానాం అభివృద్ధికి ఎన్ని అడ్డంకులెదురైనా వాటిని అధిగమించి పనులు పూర్తిచేస్తానని స్పష్టం చేశారు.

పెరుగుతున్న వరద



రాఘువేంద్ర వారధి వద్ద మెట్ల మీదకు వస్తున్న వరద నీరు

ఐ.పోలవరం: గోదావరిలో వరద క్రమక్రమంగా పెరుగుతోంది. ముమ్మిడివరం, అమలాపురం నియోజకవర్గాలను ఆనుకుని ప్రవహిస్తున్న గౌతమీ, వృద్ధ గౌతమీ, వైనతేయ నదీ పాయల్లో వరద పరవళ్లు తొక్కుతోంది. ముంపు ప్రభావిత ప్రాంత ప్రజలు అప్రమత్తంగా ఉండాలని అధికారులు సూచిస్తున్నారు. మరో మూడు రోజులపాటు వర్షాలు కురుస్తాయన్న నేపథ్యంలో గోదావరి మరింత ఉధృతంగా ప్రవహించనుంది.

సర్వాయి పాపన్నకు నివాళి



సర్వాయి పాపన్న చిత్రపటానికి నివాళులర్పిస్తున్న గౌడ సంఘం ప్రతినిధులు

అమలాపురం టౌన్: గెరిల్లా పోరాట యోధుడు సర్దార్ సర్వాయి పాపన్న గౌడ్ జయంతిని పట్టణ గౌడ సంఘం ఆధ్వర్యంలో సోమవారం ఘనంగా నిర్వహించారు. స్థానిక దేవి సెంటరులోని పట్టణ గౌడ కార్యాలయంలో సంఘ అధ్యక్షుడు మట్ట రవి కిషోర్ అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమంలో తొలుత ఆయన చిత్రపటానికి సంఘీయులు పూలమాలలు వేసి నివాళులర్పించారు. బహుజనుల అభ్యున్నతికి పాపన్న గౌడ్ చేసిన సేవలను సంఘీయులు కొనియాడారు. సంఘం గౌరవాధ్యక్షుడు వీరిన సాయిరామ్, ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్, ఆర్థిక కార్యదర్శి అయినవిల్లి నాగేంద్రకుమార్, సంఘ సభ్యులు ఆయన పోరాటతత్వం, విరోచిత నిర్ణయాలపై ప్రసంగించారు.

అమలాపురం రూరల్: సర్దార్ పాపన్న గౌడ్ బహుజన రాజ్యాధికారం కోసం పోరాడిన ధీశాలి అని ఎమ్మెల్యే ఆనందరావు అన్నారు. కామనగరువులో సోమవారం పాపన్న గౌడ్ జయంతి ఘనంగా నిర్వహించారు. ఎమ్మెల్యేతోపాటు గౌడ సంఘం నాయకులు ఆయన విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో అమలాపురం నీటి సంఘం అధ్యక్షుడు వెంకటేశ్వరరావు, మార్కెట్ కమిటీ చైర్‌పర్సన్ అధికారి జయవెంకటలక్ష్మి, ఉపసర్పంచ్ భాస్కరరావు, గౌడ సంఘం నాయకులు ముప్పిడి శ్రీను, రాజులపూడి మహేశ్వరరావు, ఎస్సీ సెల్ కార్యదర్శి పాలమూరి ధర్మపాల్, నందుల సత్తిబాబు పాల్గొన్నారు.

జీఓను రద్దు చేయాలని నిరసన



ఎ.వేమవరంలో నిరసన తెలుపుతున్న రమేష్ తదితరులు

అమలాపురం రూరల్: ప్రభుత్వ పాఠశాలలోకి రాజకీయ నాయకులు, ప్రజాసంఘాల నాయకులు వెళ్లకూడదని కూటమి ప్రభుత్వం విడుదల చేసిన జీవో నెం.30 విద్యార్థుల పాలిట శాపంగా మారిందని, ఈ జీవోను వెంటనే రద్దు చేయాలని వైఎస్సార్ సీపీ విద్యార్థి విభాగం నాయకులు డిమాండ్ చేశారు. అమలాపురం రూరల్ ఎ.వేమవరంలోని అంబేడ్కర్ విగ్రహం వద్ద సోమవారం సాయంత్రం నిరసన తెలిపారు. ఉభయ గోదావరి జిల్లాల రీజనల్ కో–ఆర్డినేటర్ జిల్లెళ్ల రమేష్ మాట్లాడుతూ, రాష్ట్రంలో రాజ్యాంగం లేదని, రెడ్‌బుక్ పాలన, ఎల్లో బుక్ ఎడ్యుకేషన్ పాలసీ నడుస్తుందన్నారు. ప్రభుత్వం విద్యార్థుల సమస్యలు బయటకి వస్తాయన్న భయంతోనే జీవోని రిలీజ్ చేసిందని విమర్శించారు. ప్రభుత్వ విద్యను నీరుగార్చడమే మంత్రి లోకేష్ లక్ష్యమని దుయ్యబట్టారు. రాష్ట్రంలో జైలులో ఉన్న ఖైదీలను కలవడానికి వెసులుబాటు ఉన్నది గాని, చదువుకునే విద్యార్థులను కలవడానికి అవకాశం లేకుండా చేసిన ఘనత సీఎం చంద్రబాబుకే దక్కుతుందని మండిపడ్డారు. కార్యక్రమంలో విద్యార్థి నాయకులు వింటి రాజా, కీర్తి రైనా, దేవరపల్లి గౌతమ్, ఉండ్రు వినోద్, గెల్ల శ్రీనాథ్, బన్నీ, మధు పాల్గొన్నారు.

ప్రమాదానికి గురైన ఆయిల్ ట్యాంకర్



చల్లపల్లిలో గుంతలో దిగబడిన ట్యాంకర్

ఉప్పలగుప్తం: మండలంలోని చల్లపల్లి పంచాయితీ పరిధి జల్లివారిపేట సమీపంలో ఆయిల్ ట్యాంకర్ సోమవారం అదుపుతప్పి ప్రమాదానికి గురైంది. నాగాయిలంక నుంచి ఎస్.యానం అన్‌లోడింగ్ పాయింట్‌కు వస్తున్న క్రూడ్‌తో ఉన్న ఆయిల్ ట్యాంకర్ రోడ్డు పక్కన ఉన్న గుంతలో దిగబడటంతో ట్రాఫిక్‌కు అంతరాయం ఏర్పడింది. లారీ పైభాగంలో విద్యుత్ తీగలు ఉండటంతో ఏ ప్రమాదం జరుగుతుందో అని స్థానికులు భయాందోళన చెందారు. స్థానికులు పరిశ్రమ సిబ్బందికి సమాచారం అందించినా స్పందించకపోవడంతో ప్రమాదం జరిగితే ఎవరు బాధ్యత వహిస్తారని స్థానికులు మండిపడ్డారు.

కోనసీమ అందాల ఫొటోల ప్రదర్శన



సీనియర్ ఫొటోగ్రాఫర్ సీవీ రావును సన్మానిస్తున్న తోటి ఫొటోగ్రాఫర్లు

మలికిపురం: ప్రపంచ ఫొటోగ్రఫీ దినోత్సవాన్ని సోమవారం మలికిపురం డిగ్రీ కళాశాలలో ఘనంగా నిర్వహించారు. రాష్ట్ర అసోసియేషన్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయిలో ఫొటోగ్రాఫర్లు కోనసీమ అందాల అద్భుత మైయిన ఫొటోలను ప్రదర్శనలో ఉంచారు. కార్యక్రమాన్ని కళాశాల కరస్పాండెంట్ మంగెన వెంకట సత్యనారాయణ మూర్తి జ్యోతి ప్రజ్వళన చేసి ప్రారంభించగా అసోసియేషన్ గౌరవాధ్యక్షులు సి.వి.రావును వేదికపై సన్మానించారు. జిల్లా అధ్యక్షులు గెద్దం సురేష్ కుమార్, ముషిని బాబులు, నల్లి మీనన్, నల్లి శ్రీను, కంచి ప్రసాద్, అడబాల ప్రసాద్, శేఖర్, బావ కుమార్, ప్రిన్సిపాల్ ఆనంద మహానీ, అధ్యాపకులు రవి తదితరులు పాల్గొన్నారు.

పాలకమండలి సభ్యుల ప్రమాణ స్వీకారం

తాళ్లరేవు: కేశవపురం గ్రామంలో ఉన్న శ్రీదేవీ, భూదేవి సమేత కేశవస్వామి వారి దేవస్థాన నూతన పాలకమండలి ప్రమాణ స్వీకారం సోమవారం రాత్రి అట్టహాసంగా జరిగింది. ఆలయ ఈఓ యర్రా వేంకటేశ్వరరావు నూతన పాలకమండలి సభ్యులతో ప్రమాణ స్వీకారం చేయించారు. ఆలయ చైర్మన్‌గా గాదిరాజు సతీష్‌రాజు, డైరెక్టర్లుగా పెద్దింటి శ్రావణ్‌కుమార్, చావలి రవి, కోటిపల్లి రమణ, భూసారపు కనకమహాలక్ష్మి, వాతాడి భాగ్యలక్ష్మి, వెంకట సుధారత్నం, గుత్తుల కృష్ణమూర్తి, సబ్బతి బాబ్జీ, పెండ్యాల వీరవెంకట సత్యన్నారాయణ ప్రమాణ స్వీకారం చేశారు. ఈ కార్యక్రమానికి ముమ్మిడివరం ఎమ్మెల్యే దాట్ల సుబ్బరాజు ముఖ్యఅతిథిగా హాజరై నూతన కమిటీ సభ్యులను అభినందించారు.

రామాలయం పనుల పరిశీలన

యానాం: నియోజకవర్గ పరిధిలో మెట్టకూరు ఎస్సీ పేటలోని రామాలయం మరమ్మతు పనులను సోమవారం ఎమ్మెల్యే అశోక్ పరిశీలించారు. ఆయన మాట్లాడుతూ, గతంలో కొంతమంది రాజకీయ లబ్ధి కోసం దళిత గ్రామాల్లో ఆలయాలు అభివృద్ధి చేయకుండా రాజకీయాలు చేసేవారని, కానీ తాను చేసిన కృషితో ప్రభుత్వమే ఒక టెండర్ వేసి రామాలయం పనులు పూర్తిచేసే విధంగా చర్యలు తీసుకుందన్నారు. రామాలయం పనులు ప్రస్తుతం ముగింపు దశలో ఉండటం ఆనందంగా ఉందన్నారు. టెండరులో రామాలయ గర్భగుడికి స్టెయిన్‌లెస్ స్టీల్ గ్రిల్లు ఏర్పాటు చేయాలని గ్రామస్తులు కోరడంతో దానికి సంబంధించిన పనులు సైతం పూర్తి చేయాలని ఆదేశించారు. అవసరమైతే సొంత డబ్బుతో స్టీల్ గ్రిల్ ఏర్పాటు చేస్తానని హామీ ఇచ్చారు.

రేవుల్లో ప్రయాణాల నిలుపుదల

మామిడికుదురు: అల్పపీడనం ప్రభావంతో కురుస్తున్న భారీ వర్షాల వల్ల మండలంలోని రెండు ప్రధాన రేవుల్లో బోట్ల రాకపోకలను సోమవారం తాత్కాలికంగా నిలిపివేశారు. ఉన్నతాధికారుల ఆదేశాల మేరకు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ అడబాల శ్రీనివాస్ గోగన్నమఠం, కరవాక రేవులను పరిశీలించారు. స్థానికులతో మాట్లాడారు. అక్కడి పరిస్థితిని సమీక్షించారు. రెండు రేవుల్లోనూ బోటు రాకపోకలను దగ్గరుండి నిలిపి వేయించారు. అక్కడకు వచ్చిన ప్రయాణికులను వెనక్కి తిప్పి పంపారు.

విద్యార్థిని వైద్యానికి రూ.1.18 లక్షల సాయం

మామిడికుదురు: లక్కవరంకి చెందిన ఇంటర్ సెకండియర్ విద్యార్థిని నయనాల జాహ్నవీ పుష్ప అనారోగ్యంతో బాధపడుతుంది. నిరుపేద కుటుంబానికి చెందిన ఆమె వైద్యానికి రూ.10 లక్షలు ఖర్చవుతుందని డాక్టర్లు తెలిపారు. మామి డికుదురుకు చెందిన వంగవీటి మోహనరంగ, రాధా మిత్రమండలి సభ్యులు సోమవారం రూ. 1.18 లక్షల సాయం అందించారు. ఈ మొత్తాన్ని యువత సేకరించి యువతి తండ్రి సాంబమూర్తి కి అందజేశారు. యువత, పెద్దలు పాల్గొన్నారు.

కాంగ్రెస్ నేతల కొవ్వొత్తుల ర్యాలీ

అమలాపురం టౌన్: కేంద్రంలో బీజేపీ ప్రభుత్వం, ఎన్నికల కమిషన్ చేసిన ఓట్ల అక్రమాలు, చోరీపై అమలాపురంలో కాంగ్రెస్ నాయకులు కొవ్వొత్తుల ర్యాలీ ద్వారా సోమవారం రాత్రి నిరసన తెలిపారు. స్థానిక గడియారం స్తంభం సెంటర్లో నిరసన కార్యక్రమం చేపట్టారు. పీసీసీ ఉపాధ్యక్షుడు కొత్తూరి శ్రీను, నియోజకవర్గ పార్టీ కన్వీనర్ సుభాషిణీ, పట్టణ పార్టీ అధ్యక్షుడు బాబి, పార్టీ రాష్ట్ర అధికార ప్రతినిధి రామకృష్ణారావు, ఏఐసీసీ మెంబర్ యార్లగడ్డ రవీంద్ర తదితరులు ఈవీఎంల మోసంతో ఎన్నికల కమిషన్, ఓట్ల చోరీలో బీజేపీ చేసిన అంతర్నాటంపై ధ్వజమెత్తారు. కార్యక్రమంలో పలువురు నాయకులు పాల్గొన్నారు.